
రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం	సెహరి ఆదివారం
కర్నూలు	6:33	5:04
నంద్యాల	6:30	5:04


కర్నూలు నగరం శివారు కాలనీల్లో ట్యాంకర్ల వద్ద తాగునీటి సమరం (ఫైల్)

నగరానికి దాహం

కర్నూలు నగరంలో జనాభాతో పాటు తాగునీటి కష్టాలు కూడా పెరుగుతున్నాయి. ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 0.15 టీఎంసీలే. అంటే 45 రోజులకు కూడా సరిపోవడం లేదు. నగరవాసుల ప్రాణాధారం సుంకేసుల జలాశయం సామర్థ్యం 1.20 టీఎంసీలే. తుంగభద్రపై 0.50 టీఎంసీల సామర్థ్యంతో చెక్ డ్యాం నిర్మించాలనే ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గోరుకల్లు జలాశయం ద్వారా కర్నూలు నగరానికి కృష్ణా జలాలు సరఫరా చేయడమే ఉత్తమం పరిష్కారమని నిపుణులు పేర్కొంటున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- వేసవిలో కర్నూలు వాసులకు పొంచి ఉన్న నీటి ముప్పు
- రోజుకు 83 ఎంఎల్‌డీల నీరు అవసరం.. ఇస్తున్నది 78 మిలియన్ లీటర్లు
- వర్షాభావ పరిస్థితులతో తీవ్ర కష్టాలు
- పాతికేళ్లుగా నివేదికలకే పరిమితమైన ప్రత్యామ్నాయ ప్రాజెక్టులు
- తుంగభద్రపై 0.50 టీఎంసీలతో చెక్ డ్యాంకు సన్నాహాలు
- గోరుకల్లు నుంచి పైపులైన్ ఉత్తమం అంటున్న నిపుణులు


కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర జనాభా 6 లక్షలు మైలురాయి దాటింది. వేసవి శివారు కాలనీల్లో కార్పొరేషన్ వాటర్ ట్యాంక్ దాహం తీర్చే పరిస్థితి ఉంది. రోజుకు రోజుకు 83 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) సరఫరా చేయాల్సి ఉంటే.. 78 ఎంఎల్‌డీకు మించి ఇవ్వడం లేదు. నగరవాసుల దాహం తీర్చే ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 0.15 టీఎంసీలే. సుంకేసుల జలాశయం సామర్థ్యం 1.20 టీఎంసీలు. ప్రస్తుతం 0.45 టీఎంసీలకు నీటి నిల్వ ఉంది. 2007, 2012, 2014లో సుంకేసులు పూర్తిగా ఎండిపోతే.. తంగభద్ర నదిలో దేవమ్మమడుగు నుంచి నీటికి ఎత్తిపోసి నగర ప్రజల గొంతు తడిపారు.

కర్నూలు నగర పాలక సంస్థ తాగునీటి వివరాలు	
నగరం జనాభా	6 లక్షలు
ఇండ్ల తాగునీటి కుళాయిలు	65,720
వాణిజ్య సరఫరా కుళాయిలు	1,350
అవసరమైన తాగునీరు	83 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా	78 ఎంఎల్‌డీ
తాగునీటి పన్ను ఆదాయం	రూ.19.87 కోట్లు
ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు	
ఎస్ఎస్ ట్యాంకు	0.15 టీఎంసీలు
సుంకేసుల బ్యారేజీ	0.45 టీఎంసీలు
ట్యాంకర్ల ద్వారా సరఫరా	16-20 ట్యాంకర్లు

తుంగభద్రపై చెక్ డ్యాం సాధ్యమేనా..?

నగర శివారులో రాఘవేంద్రస్వామి మఠం వద్ద తుంగభద్ర నదిపై 0.50 టీఎంసీల సామర్థ్యంతో చెక్ డ్యాం నిర్మిస్తే.. తాగునీటి సమస్యతో పాటు నది ఆవలి ఒడ్డున ఉన్న పలు గ్రామాలకు రహదారి సమస్య తీరుతుందని 2013లో రూ.64.89 కోట్లు మంజూరు చేస్తూ 2013 జూన్ 18న జీవో 56 జారీ చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఈ ప్రాజెక్టు అటకెక్కింది. 2014లో వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎస్వీ మోహన్‌రెడ్డి ఆ తరువాత టీడీపీలో చేరారు. గాజులదిన్నె జలాశయం నుంచి రూ.350 కోట్లతో పైపులైన్ నిర్మించాలనే ప్రతిపాదన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నాటి సీఎం చంద్రబాబు ఓకే చెప్పడంతో జీడీపీ నుంచి కర్నూలుకు తాగునీటి పైపులైన్ పట్టాలెక్కుతుందని అనుకుంటే.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ రాఘవేంద్రస్వామి మఠం - గొందిపర్ల మధ్య 0.50 టీఎంసీలతో చెక్ డ్యాం సాధ్యసాధ్యాలపై జలవనరులు, కార్పొరేషన్ ఇంజనీర్లు అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇది అనుకూలమే అని నివేదిక ఇచ్చినా.. ఎగువన రోజుకు 60 ఎంఎల్‌డీ మురుగునీరు తుంగభద్రలో కలుస్తుండడంతో నదీజలాలు కలుషితమై తాగడానికి పనికి రావని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


కర్నూలు నగర శివారున రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్రపై చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రదేశం

గోరుకల్లు నుంచి పైపులైన్ ప్రతిపాదన:

గోరుకల్లు జలాశయం సామర్థ్యం 12.44 టీఎంసీలు. అందులో డెడ్ స్టోరేజీ కెపాసిటీ 2.15 టీఎంసీలు నిత్యం నిల్వ ఉంటుంది. కృష్ణా నదికి ప్రతియేటా వరదలు వస్తున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజార్వయర్‌ను గ్రావిటీ ద్వారా నింపుతున్నారు. సోమయాజులపల్లె కొండపై గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (జీఎల్‌బీఆర్) నిర్మించి.. గోరుకల్లు నుంచి సోమయాజులపల్లె జీఎల్‌బీఆర్‌కు కృష్ణా జలాలు ఎత్తిపోసి.. అక్కడి నుంచి జగన్నాథగట్టుపై నిర్మించే జీఎల్‌బీఆర్‌కు, అక్కడి నుంచి మునగాలపాడు ఎస్ఎస్ ట్యాంక్‌కు గ్రావిటీ పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయవచ్చని ఇంజనీర్లు అంటున్నారు. గోరుకల్లు నుంచి కర్నూలు తాగునీటి పథకం కోసం సుమారుగా రూ.270 కోట్లతో అమృత్-0.2 పథకం కింద ప్రతిపాదనలు తయారు చేశారు. గోరుకల్లు జలాశయం నుంచి కలుషితం లేని కృష్ణా జలాలు పంపింగ్ చేస్తుడడంతో తాగునీటికి మంచిదని నిపుణులు అంటున్నారు. జగన్నాథగట్టుపై ఫిల్టర్ బెడ్స్ నిర్మించి పాణ్యం నియోజకవర్గంలో విస్తరిస్తున్న కాలనీలకు పుష్కలంగా తాగునీరు ఇవ్వవచ్చు అని, గోరుకల్లు-కర్నూలు తాగునీటి పథకం ఉత్తమమని పలువురు అంటున్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు




కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అకడమిక్ క్యాలెండర్ 2024-25 ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యజమాన్య పాఠశాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో మాత్రం మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా, గ్రామ పంచాయతీ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో తాగునీటి వసతి ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పాఠశాలలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాఠశాలల పనివేళలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు వర్తించాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పాఠశాలల పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా హెచ్ఎంలు ఏర్పాటు చేసుకునేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మగవలు
- కోరికలు తీరాలంటే కొంగు కట్టాల్సిందే...
- సంతెకుడ్లూరులో వింత ఆచారం
6

నమో.. నారసింహ...

- వైభవంగా ప్రహ్లాద వరద స్వామి రథోత్సవం
- భక్త జనసంద్రంగా మారిన అహోబిల క్షేత్రం


దిగువ అహోబిలంలో భక్తజన సందోహం మధ్య రథోత్సవం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 14(ఆంధ్రజ్యోతి) : భక్తుల గోవింద నామస్మరణ, మంగళ వాయిద్యాల మధ్య దేవదేవుని రథోత్సవం శుక్రవారం కన్నులపండువగా సాగింది. అహోబిలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులు కొలువైన బ్రహ్మరథం ఆలయ మాడవీధుల్లో కదిలి వస్తుండగా భక్తులు తన్మయం చెందారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామిని పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అహోబిలేశుడు ఉభయ దేవేరులతో కలిసి రథాన్ని అధిష్టించి తిరువీధుల్లో విహరిస్తుండగా దిగువ అహోబిల క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఉభయ దేవేరులతో కొలువైన జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. రాత్రి వైభవంగా పుష్పయాగోత్సవం నిర్వహించారు.


దిగువ అహోబిలంలో రథంలో కొలువైన ఉత్సవమూర్తులు

పది పరీక్షలకు కసరత్తు

- జిల్లాలో హాజరు కానున్న 40,776 మంది విద్యార్థులు
- 172 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- నిర్వహణపై నేడు సమీక్ష సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ నెల 17 నుంచి మొదలు కాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలో పూర్తి స్థాయిలో ఫర్నీచర్, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, వైద్య, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కలెక్టర్ రంజిత్ బాషా ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో హాజరు కానున్న 40,776 మంది విద్యార్థులు

జిల్లాలో 517 ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 40,776 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 31,410 మంది కాగా, ప్రైవేటుగా హాజరయ్యే విద్యార్థులు 7,038 మంది, ఓపెన్ స్కూల్ ద్వారా 2328 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాను 46 జోన్లుగా విభజించారు. 33 పోలీస్ స్టేషన్‌లలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రశ్నపత్రాలు భద్రపరిచారు. ఏ-కేటగిరి పరీక్ష కేంద్రాలు 92, బి-కేటగిరి పరీక్ష కేంద్రాలు 64, సి-కేటగిరీ పరీక్ష కేంద్రాలు 16 ఏర్పాటు చేశారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 177 మంది విద్యార్థులకు స్క్రైబ్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు 2,234 మందిని నియమించారు. ఇందులో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు 172 మంది, డిపార్టుమెంటు ఆఫీసర్లు 172 మంది, ఇన్విజిలేటర్లు 1840 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 7, రూట్ ఆఫీసర్లు 12, అడిషనల్ రూట్ ఆఫీసర్లు 12, సి-కస్టోడియన్లు 11 మందిని నియమించారు. ఏర్పాట్ల సమీక్ష సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు కర్నూలు బీ.క్యాంపు టీజీవీ కళ్యాణ మండపంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు.



ప్రత్యేక తనిఖీ బృందాల ఏర్పాటు

పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో చూచి రాతలు, మాస్ కాపీయింగ్ వంటి సంఘటనలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు ఈసారి 33 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. జిల్లా కేంద్రంలో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పరిష్కా రానికి చర్యలు తీసుకోబోతున్నాం.

-శ్యామ్యూల్ పాల్, డీఈవో

మగవలు



● కోరికలు తీరాలంటే కొంగు కట్టాల్సిందే..

● సంతెకుడ్లూరులో వింత ఆచారం

హోలీ పండుగ వచ్చిందంటే చాలు యువత నుంచి వృద్ధుల వరకు సంబరాలే సంబరాలు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందంగా గడుపుతారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో మాత్రం హోలీ పండగను పురస్కరించుకొని మగవారు మహారాణుల్లా దర్శనమిస్తారు. కోరిన కోరికలు తీరాలంటే గ్రామంలో వెలసిన రతీమన్మథులను స్త్రీ వేషధారణతో మగవారు దర్శించుకోవాల్సిందే. రెండు రోజుల పాటు గ్రామంలో రతీ మన్మథుల రథోత్సవం, కామ దహనం శవయాత్ర ఉంటాయి. మగవారి మగువల వేషధారణతో గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది.



మగువల వేషధారణలో బయల్దేరిన మగవారు

ఆదోని రూరల్/ఆదోని మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని బసవేశ్వరస్వామి దేవాలయంలో ఓ గదిలో రతీమన్మథులను ఉంచుతారు. ఏడాదిలోని 365 రోజుల్లో ఒక్క ఐదు రోజులు మాత్రమే రతీమన్మథులను పాల్గుణ శుద్ధ దశమికి ఐదు రోజుల ముందు దేవాలయం బయట ఉంచి పూజలు నిర్వహిస్తారు. హోలీ పౌర్ణమి రోజు, ఆ మరుసటి రోజు రతీమన్మథులు విశేష పూజలందుకుంటారు. తదనంతరం పూజార్లు, గ్రామ పెద్దలు యథావిధిగా రతీ మన్మథులను దేవాలయం గదిలో భద్రపరుస్తారు. ఈ ఐదు రోజులపాటు కోరిన కోర్కెలు తీరిన మగవారు కోర్కెలు కోరే మగవారు స్వామివార్లను మహిళలకు ఏమాత్రం తీసిపోని విధంగా మగువ రూపంలో దర్శనం చేసుకుంటారు.



పూజలందుకుంటున్న రతీమన్మథులు

ప్రత్యేక పూజలు : గ్రామంలోని బసవేశ్వర స్వామి దేవాలయంలో వెలసిన రతీమన్మథులను హోలీ పండుగ సందర్భంగా వివిధ పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు స్వామివార్లను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకుంటారు. రతీమన్మథుల దర్శనం నిమిత్తం కోరిక తీర్చే క్రమంలో బాలుడు అయితే గౌను ధరిస్తారు. యువకులైతే పంజాబీ డ్రస్ వేసుకుంటారు. అదే మగ పెద్దలు అచ్చం మగువలా అంచు పట్టుచీర కట్టుకొని బంగారు ఆభరణాలు గొంతు నిండా ధరించి నడుంకు వడ్డానం కట్టుకొని, నెత్తిన పూలు పెట్టుకొని... నుదుట బొట్టు పెట్టుకొని చేతులకు గాజులు వేసుకొని... కాళ్లకు పారాణి రాసుకొని, కంటికి కళ్లజోడు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి రతీమన్మథులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ వారి ప్రజలకు షరా మామూలే అనిపించినా... కొత్తవారికి మాత్రం ఇది వింతనే.



మగువ రూపంలో అన్న మహేష్‌ను అలంకరిస్తున్న చెల్లెలు

నాకు ఉద్యోగం రావాలని అమ్మ మొక్కుకుంది



నా చిన్న తనంలో మా అమ్మ నాకు ప్రభుత్వ ఉద్యోగం వస్తే నాకు 11 సంవత్సరాలపాటు చీరకట్టి దర్శించుకుంటాడని రతీమన్మథులను కోరుకుంది. మా అమ్మ కోరిక మేరకే నాకు ఆస్పరి ఏపీజీబీలో పది సంవత్సరాల క్రితం ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి నేను ప్రతి ఏడాది హోలీ రోజున రతీమన్మథులకు చీరకట్టి దర్శించుకుంటున్నా.

- ఉదయ్ కుమార్, ఆస్పరి ఏపీజీబీ ఉద్యోగి, సంతేకుడ్లూరు

పుట్టుకతోనే అంధుడను..



నేను పుట్టుకతోనే అంధుడను. నా కొడుకు ప్రయోజకుడైతే చీరకట్టి మిమ్మల్ని దర్శించుకుంటాడని రతీమన్మథులను మా అమ్మ, నాన్న మొక్కుకున్నారు. నాకు రెండు కళ్లు కనిపించకున్నా కర్ణాటక రాష్ట్రం గదక్‌లోని వీరేశ్వర పుణ్య ఆశ్రమంలో నేను హార్మోనిస్టుగా ఎంతో మందికి విద్యను నేర్పిస్తున్నాను. నేను అంధుడనైనా నాకు ఈ అవకాశం దక్కినందుకు రతీమన్మథులకు ప్రతి ఏడాది చీరకట్టి దర్శించుకుంటున్నా. ఇప్పటికే 20 సంవత్సరాలుగా ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

-వీరభద్రప్ప, హార్మోనిస్టు, సంతేకుడ్లూరు

జీడీపీకి నిలిచిన హంద్రీ నీవా నీరు

● ప్రాజెక్టులో ఇక 1.7 టీఎంసీలే

● రోజుకు 50 క్యూసెక్కుల నుంచి 80 క్యూసెక్కుల వరకు ఆవిరి

● సాగు, తాగు నీరు పొదుపుగా వాడాలి

గోనెగండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి విడుదలయ్యే నీరు వారం రోజులుగా నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. హంద్రీ నీవా నుంచి ప్రాజెక్టుకు నాలుగు నెలలుగా రోజుకు 100 నుంచి 120 క్యూసెక్కుల వరకు నీరు విడుదలయ్యేది. అయితే ఎండాకాలం కారణంగా శ్రీశైలం బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో హంద్రీ నీవాకు నీటి విడుదల నిలిచిపోయింది. ప్రాజెక్టు కింద 13,000 ఎకరాల ఆయకట్టును రైతులు సాగు చేసుకున్నారు. ప్రతి రోజూ సాగుకు కుడి, ఎడమ కాలువల ద్వారా 100 నుంచి 120 క్యూసెక్కుల నీటిని పంటల సాగుకు విడుదల చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు జీడీపీ అధికారులు కుడి కాలువ నుంచి ఎడమ కాలువ నుంచి అవసరమైన మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. అనవసరమైన సమయంలో రెండు కాలువలకు నీటిని నిలిపివేసి మరో వారం రోజుల తరువాత పంటలకు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుండటంతో రోజుకు 50 క్యూసెక్కుల నుంచి 80 క్యూసెక్కుల వరకు నీరు ఆవిరైపోతోంది. ప్రాజెక్టు కింద డోన్, క్రిష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక హంద్రీనీవా నీరు నిలిచిపోవడంతో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాహ్.. దహి వడ..!







● రంజాన్ వేళ నోరూరించే వంటకం ● ప్రత్యేకంగా విక్రయ కేంద్రాల ఏర్పాటు ● పాత నగరంలో జోరుగా అమ్మకాలు

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో రోజా (ఉపవాసం) పాటిస్తున్న ముస్లింలు సాయంకాల వేళ 'ఇఫ్తార్' (రోజా విరమణ) సమయంలో అల్పాహారంగా స్వీకరిస్తారు. వివిధ రకాల పండ్లు, తేలికగా జీర్ణమయ్యే తినుబండారాలపై ఆసక్తి చూపిస్తారు. అలాంటి వాటిలో 'దహి వడ' (పెరుగు వడ)కు ఒక ప్రత్యేకత ఉంది. సులువుగా జీర్ణం కావడంతో పాటు, పన్నెండు గంటల పాటు ఆహారం లేకుండా ఉన్న వారి శరీరాలకు వెంటనే సాంత్వన చేకూర్చే గుణం ఉన్న ఈ దహి వడలు రంజాన్ మాసంలో పాతనగరంలో అమ్మకాలకు పెట్టింది పేరు. ఈ మాసంలో తయారు చేసి అమ్మకాలు చేసే ఈ ప్రత్యేక రుచుల 'దహివడ', 'సమోసాలు' వంటివి ముస్లింలతో పాటు ఇతరులను కూడా ఎంతో ఇష్టంగా తింటారు. పాతనగరంలో వీటి తయారీలు, అమ్మకాలు ఇటీవల జోరందుకున్నాయి. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు పాతనగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 30పైగా విక్రయకేంద్రాలు వెలిసి వీటిని అమ్మకాలు చేస్తున్నాయి. వేడివేడిగా తయారయ్యే ఈ దహి వడ, సమోసాలు రోజా ఇఫ్తార్ సమయానికి ఒక గంట ముందుగా అమ్మకాలు ప్రారంభిస్తారు. అయితే కేవలం ఒక గంటలోపే మొత్తం అమ్మకాలు జరిగిపోతాయి. తిరిగి వీటిని కొనుగోలు చేయాలంటే మళ్లీ ఒకరోజు వరకు ఆగాల్సిందే.



తయారీ కూడా ప్రత్యేకమే...

వ్యాపారులు ఒకరోజు ముందే మినపపప్పు నానబెట్టి, మెత్తగా గ్రైండింగ్ చేసి, మేలురకం నూనెలో దోరగా వేయిస్తారు. తర్వాత వీటిని వెడల్పాటి గిన్నెలో చిక్కటి పాలతో తయారైన పెరుగులో రెండు గంటల పాటు నానబెడతారు. జీలకర్ర, ఇతర మసాల దినుసులతో పోపు పెట్టిన పెరుగును పీల్చుకున్న వడలపై చిన్నగా తురిమి సిద్ధం చేసుకొన్న కొత్తిమీర, క్యారెట్, అల్లం మిశ్రమాన్ని చేర్చి అందిస్తారు. చూడగానే నోరూరించే దహి వడలు జత రూ.50లాగా విక్రయిస్తారు. పాతనగరంలో పెద్దమార్కెట్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, మించిన్‌బజార్, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో దహి వడ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు మేలురకం గోధుమ పిండితో తయారు చేసిన సమోసాలను కూడా ఆసక్తిగా కొనుగోలు చేస్తారు. ఆలూకుర్మాతో తయారైనవి కొన్ని కాగా, క్యారట్, బీట్‌రూట్‌లతోపాటూ విజిటెబుల్స్‌తో తయారైన సమోసాలు, కేవలం ఆనియన్ తురుము, మసాలతో తయారైన సమోసాలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి.

కర్నూలుకు పరిచయం చేసింది మేమే



పాతనగరంలో మా పూర్వీకుల కాలం నుంచి స్వీట్ స్టాల్ నిర్వహిస్తున్నాం. సుమారు 70 ఏళ్ల క్రితమే మా తండ్రి జలీల్ అహ్మద్ హైదరాబాదులో దహి వడ తయారు చేయడం నేర్చుకుని వచ్చి ఆయన రంజాన్ మాసంలో వీటిని అమ్మడం ప్రారంభించారు. అలా వీటిని తొలుత అమ్మకాలు ప్రారంభించింది మేమే. అప్పటి నుంచీ మాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మా తండ్రి వారసత్వంగా మేమూ రంజాన్ మాసంలో దహి వడ, వివిధ రకాలతో సమోసాలు తయారు చేసి అమ్ముతుంటాం. మావద్ద వీటిని తయారు చేయడం నేర్చుకున్న చాలా మంది నగరంలో వివిధ చోట్ల వీటిని అమ్మకాలు చేస్తున్నారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా ఇష్టంగా స్వీకరిస్తారు.

- జేకే అబిద్, వ్యాపారి, పూలబజార్, కర్నూలు

అవగాహనతోనే హక్కులకు రక్షణ

● వినియోగదారుల హక్కులకు బలమైన చట్టాలు

● హక్కుల ఉల్లంఘనలపై అస్త్రం సంధించాలి

● నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

మార్కెట్ మాయాజాలంలో నిత్యం వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. వినియోగదారుల హక్కుల సంరక్షణకు బలమైన చట్టాలు ఉన్నా.. మోసాలు, అక్రమాలు ఆగడం లేదు. శనివారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కుల చట్టాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం వినియోగదారుల రక్షణకు 1986లో ఒక విప్లవాత్మకమైన చట్టం తీసుకొచ్చింది. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం 1985 ఏప్రిల్ 9న ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శక సూత్రాలను సభ్యదేశాలు ఆమోదించాయి. 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ బిల్లును పార్లమెంట్ ఆమోదించారు. 1986 డిసెంబరు 24న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఆనాటి నుంచి ఏటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నాం. వినియోగదారులు వస్తు, సేవల్లో ఏ రూపంలో మోసపోయినా కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో ఇంటి నుంచి వివిధ వస్తువులు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలను వినియోగదారుల రక్షణ చట్టం-2019 పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా, పరిహారం కోరే హక్కు ఉంది.



జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కోర్టు

90 రోజుల్లో కేసుల పరిష్కారానికి కృషి





బాధితుల ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన స్వీకరించి ప్రతివాదులకు నోటీసులు పంపించి.. వినియోగదారులకు అండగా నిలుస్తాం. ఆన్‌లైన్ ద్వారా కూడా విచారణ చేసి బాధితులకు అండగా నిలుస్తున్నాం. జిల్లా వినియోగదారుల కమిషన్ ఏర్పాటు అయిన నాటి నుంచి 8,029 కేసులు నమోదు కాగా.. 8.097 కేసులు పరిష్కరించాం. ఈ ఏడాది కాలంలో 262 కేసులు పరిష్కరించాం.

- కరణం కిశోర్‌కుమార్, అధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల కమిషన్, కర్నూలు

ఏ ఫిర్యాదు.. ఎక్కడ చేయాలి..!

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మూడు స్థాయిలో కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (వినియోగదారుల కమిషన్) పని చేస్తుంది. జిల్లా స్థాయి ఫోరం వస్తువులు/సేవల విలువ రూ.50 లక్షలలోపు ఫిర్యాదులు పరిష్కరిస్తుంది. రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య రాష్ట్ర స్థాయి, రూ.2 కోట్లకు మించిన విలువ కలిగిన ఫిర్యాదులను జాతీయ స్థాయి ఫోరం పరిష్కరిస్తుంది.

అవగాహన ఎంతో ముఖ్యం



వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. వస్తు, సేవల్లో మోసాలకు గురైనా పట్టించుకోవడం లేదు. అదే అక్రమార్కులకు వరంగా మారుతోంది.

- ఎన్.నారాయణరెడ్డి, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు, కర్నూలు

ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి



వినియోగదారుల హక్కులపై చైతన్యం కల్పిస్తూ వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచనలు, సలహాల కోసం ఉచిత కాల్ సెంటర్ నంబరు 1915/1800-11-4000 సంప్రదించవచ్చు.

- ఎస్. నజీమాకౌసర్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు, కర్నూలు

ఫుల్ జోష్..!





కిసాన్ ఘాట్‌లో 'హోలీ బ్లాస్ట్'

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంగుల వేడుక 'హోలీ'ని శుక్రవారం నగర వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచే వేడుక సందడి కనిపించింది. చిన్నారులు, యువకులు, మహిళలు ఈ వేడుకల్లో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. పాతనగరంలో మార్వాడీలు హోలీ సంబరాల్లో మునిగితేలారు. వన్‌టౌన్ మఠం వీధి, చిత్తారి వీధి, కుమ్మరి వీధి, రాంభొట్ల దేవాలయం తదితర ప్రాంతాల్లో చిన్నారులు, మహిళలు హోలీ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా కిసాన్ ఘాట్‌లో యాన్‌సన్ అండ్ ఫన్‌అండ్‌ఫుడ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హోలీ బ్లాస్ట్' ఈవెంట్ సంబరాలు అలరింపజేశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ వేడుక కొనసాగింది.




సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనఘోష

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

చిత్రాడదారులన్నీ జనపవనమై..



జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

శరీన్ నగర్‌లో
దారుణ హత్య

- మారణాయుధాలతో దాడి చేసిన రౌడీ షీటర్ అంజి, ఆయన వర్గీయులు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడు సంజన్న మృతి


సంజన్న (ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు సంజన్న (58) శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. సంజన్న గతంలో వైసీపీలో కాటసాని రాంభూపాల్ రెడ్డి వర్గీయుడిగా ఉన్నాడు. ఆయన భార్య లక్ష్మీదేవి కార్పొరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం ఆయన కొడుకు జయరాం కార్పొరేటర్‌గా నెగ్గారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కాటసానితో విభేదాలు వచ్చి టీడీపీలో చేరారు. మొదట గౌరు వర్గంలో చేరాలనుకొని భావించి ఆ తరువాత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వర్గంలో చేరారు. సంజన్నకు ప్రతి రోజూ ఇంటి సమీపంలో ఉండే గుడేకల్లు మెడిటేషన్ సెంటరుకు వెళ్లే అలవాటు ఉంది. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి కూడా 9 గంటల ప్రాంతంలో మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా అదే శరీన్‌నగర్‌కు చెందిన అంజి, అతని వర్గీయులు కాపు కాసి మారణాయుధాలతో కిరాతకంగా దాడి చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి అంజి వర్గీయులు పరారు కాగా.. స్థానికులు సంజన్నను ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

● అంజిపై గతంలో పలు కేసులు:

సంజన్నపై దాడి చేశాడని అనుమానిస్తున్న అంజిపై గతంలో పలు కేసులు ఉన్నాయి. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆయన అన్న కొడుకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గీయుడిగా ఉన్న అంజి సాయి ఈశ్వరుడు హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసును ఇటీవలే కోర్టు కొట్టేసింది. ఆ తర్వాత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గంలో కొనసాగుతూ వచ్చారు. ఇటీవల బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి వర్గంలో చేరినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అంజి చేసిన నేరాలపై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. మూడు నెలల కింద కూడా అంజికి, సంజన్నకు గొడవలు జరిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అది మనస్సులో ఉంచుకుని అంజి ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

● పోలీసులు అప్రమత్తం:

సంజన్న హత్యతో శరీన్‌నగర్‌లో కలకలం రేగింది. రాజకీయాల్లో ఓటర్లను ప్రభావితం చేయడంలో సంజన్నకు బాగా పట్టు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన వర్గీయులు పెద్ద ఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై శరీన్‌నగర్‌లో భారీ ఎత్తున పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్‌ఐలు చంద్రశేఖర్ రెడ్డి, గోపినాథ్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్ పరిస్థితిని సమీక్షించారు. శరీన్‌నగర్‌లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో నూతనంగా శ్రీకారం చుట్టిన నేను సైబర్ స్మార్ట్ కార్యక్రమంపై వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ బారిన పడకూడదని కరపత్రాలు, లఘు చిత్రాలతో అవగాహన కల్పించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పరిధిల్లో జిల్లా వ్యాప్తంగా 38 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు 485 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 48,600 మందికి అవగాహన కల్పించారు.

రైతు స్వప్నం సాకారం

- రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్
- పుచ్చకాయలమాడలో సీఎం చంద్రబాబు హామీ
- నిధులతో వచ్చాం.. ఆరు నెలల్లో పూర్తి చేస్తాం
- టమోటా ప్రాసెసింగ్ యూనిట్ శంకుస్థాపనలో మంత్రి టీజీ భరత్


టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు

పత్తికొండ, మార్చి,14(ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌తో రైతు స్వప్నం సాకారం కానుందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని కనకదిన్నె గ్రామం వద్ద రూ.11 కోట్లతో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబుతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా టమోటా పండే పత్తికొండ ప్రాంతంలో టమోటా గిట్టుబాటు ధర లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. గత ఏడాది పింఛన్ల పంపిణీ కోసం పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు టమోటా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీని కోసం రూ.11 కోట్ల నిధులతో పత్తికొండ మండలం కనకదిన్నె వద్ద 2.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 10 నుంచి 12 టన్నుల టమోటాను ప్రాసెసింగ్ చేసే అవకాశం ఉంటుందని, అలాగే మామిడి, అరటి, బొప్పాయి పంటల ప్రాసెసింగ్ కూడా ఈ యూనిట్ ద్వారా నిర్వహించవచ్చన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగానే కనకదిన్నె వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాధార పత్తికొండ ప్రాంతాన్ని మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అందుబాటులో ఉన్న హంద్రీ నీవా నీటిని ఎత్తిపోతల ద్వారా గ్రామ గ్రామానికి తీసుకువచ్చి తాగునీటిని అందించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అన్ని రకాలుగా వెనుకబడ్డ కర్నూలు జిల్లా పడమటి ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ గడ్డం శేఖర్‌బాబు, పీడీ ఉమాదేవి, ఆర్డీవో భరత్ నాయక్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బొజ్జమ్మ తదితరులు ఉన్నారు.


సంస్కృత భాషలో సర్టిఫికెట్ కోర్సు


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం శిక్షణ కోఆర్డినేటర్ జి. సుబ్రహ్మణ్యం

కర్నూలు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాషను దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆ భాషను మరింత విస్తృత పరిచే దిశగా కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం కార్యక్రమాలను రూపొందించిందని జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం కర్నూలులో బుధవారపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యూఢిల్లీలోని కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాల యం, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆ కళాశా ల్లో సంస్కృత అధ్యయన కేంద్రం ప్రారంభించామని తెలిపారు. సంస్కృత భాష అందరికీ అందాలనే ఉద్దేశ్యంతో, సంస్కృతం రాయడం, చదవడం, మాట్లాడటం వంటి అంశాల్లో మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ శిక్షణల్లో 15 ఏళ్ల పైబడి వారు ఎవరైనా చేరవచ్చని, వ్యాపారులు, గృహిణులు, ఉద్యోగులు, యువత ఈ శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జి.పుల్లారెడ్డి కళాశాలలో ప్రతిరోజూ సాయంత్రం 4-5 గంటల మధ్య శిక్షణ ఉంటుందన్నారు. అక్కడికి రాలేని వారికి నగరంలోని కేశవ మెమోరియల్ పాఠశాల్లో శనివారం సాయంత్రం 5-7 గంటల మధ్య, ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 90195 56184, 87623 94795 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధికారి కురిడి సురేష్, సంస్కృత భారతి జిల్లా శాఖ అధ్యక్షురాలు మహాలక్ష్మి, సంస్కృత భారత నగర అధ్యక్షులు గుబ్బా బాలస్వామి, ప్రచారకులు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పూజకు వేళాయె

- సప్తనదుల నుంచి బయల్పడుతున్న సంగమేశ్వరాలయం


నీటి మట్టం తగ్గినట్లయితే పూర్తిగా ఆలయం బయల్పడే అవకాశం ఉంది. నీటి విడుదల ఇలాగే కొనసాగితే రానున్న ఉగాది పర్వదినానికి సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చే అవకాశం ఉంది.

కొత్తపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీటి అవసరాల కోసం అధికారులు దిగువకు నీరు విడుదల చేస్తుండటంతో సప్తనదుల్లో నిక్షిప్తమై ఉన్న సంగమేశ్వరాలయం బయల్పడుతోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకు గాను 844.50 అడుగులుగా నమోదైంది. అలాగే రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గాను 69.1600 టీఎంసీలుగా నమోదైంది. దీంతో సంగమేశ్వరాలయ గోపురం మెలమెల్లగా బయల్పడుతూ వచ్చింది. కేవలం 5 నుంచి 6 అడుగుల మేర శ్రీశైలం ప్రాజెక్టు వద్ద

చికిత్స పొందుతూ వైద్య విద్యార్థిని మృతి

కర్నూలు హాస్పిటల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థిని ఎ. రమ్య తేజ (20) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. అనంతపురం జీజీహెచ్ అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ. నవీన్ కూతురు రమ్యతేజ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గత నెల 14వ తేదీ రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే విద్యార్థులు కర్నూలు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. 15 రోజుల తర్వాత కోలుకున్న డా.రమ్యతేజ కర్నూలు మెడికల్ కాలేజీలో సెకండ్ ఇయర్ ఎంబీబీఎస్ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరైంది. ఇటీవల సెకండ్ ఇయర్ ఎంబీబీఎస్ పరీక్షల ఫలితాలు కూడా వచ్చాయి. ఇందులో డా.రమ్యతేజ మంచి మార్కులతో పాస్ అయింది. మూడో సంవత్సరంలో చేరి అంతా బాగుంది అనుకున్న సమయంలో మళ్లీ ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో సొంత ఊరైన అనంతపురంలోని కిమ్స్ సవేరా హాస్పిటల్‌లో చేర్పించారు. వెంటిలేటర్ మీద చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. డా.రమ్యతేజ మృతితో కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. తోటి విద్యార్థులు అంత్యక్రియలకు హాజరై విచారం వ్యక్తం చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.పి.చిట్టి నరసమ్మ వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, డా.విజయానందబాబు విద్యార్థిని మృతి పట్ల సంతాపం తెలిపారు.

సీఎంను కలిసిన మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విజయవాడలోని సీఎం నివాసంలో శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.14 కోట్లతో నివేదికలు అందజేశారు. అలాగే కొమ్ముచెరువులో అన్యాక్రాంతమైన భూములను స్వాధీన పరుచుకుని చెరువును మట్టిని తీసి ఎత్తు పెంచి నీటితో నింపితే.. సాగు భూములతో పాటు సోలార్ కూడా నీటిని ఉపయోగించుకోవచ్చని ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని మల్లెల రాజశేఖర్ తెలిపారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా సొంత గనులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కే.రామాంజనేయులు కోరారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అభివృద్ధి కోసం ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు మునెప్ప, అంజిబాబు నాయకులు రామాంజనేయులు, వెంకటేష్, ఈశ్వర్, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి: సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం విద్యుత్ కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు నాగ రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● ఆర్టీసీని కాపాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన ఏపీఎస్‌ఆర్టీసీ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని రవాణ రంగ కార్మికుల కోసం సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్రకోశాదికారి జే.దివాకర్, కడప జోనల్ అధ్యక్షుడు ఆర్.అజీమ్‌ఖాన్, వీఎస్.రాయుడు పాల్గొన్నారు.

● కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలోని 15 డివిజన్ పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, నాయకులు మాణిక్యం, కుమార్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్మికులు చేరారు.

నగరాభివృద్ధికి సహకరించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుకాణదారులు బకాయిలు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగర పాలక శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కొత్త బస్టాండు సమీపంలో ట్రేడ్ లైసెన్సులు లేని దుకాణాలను సీజ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిలు ఉన్న దుకాణాల వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామన్నారు.

ప్రొబేషన్ పీరియడ్‌ను ఏడాదికి కుదించాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఎంపీహెచ్ఏ (మేల్) ప్రొబేషన్ పీరియడ్‌ను ఏడాదికి కుదించి పదోన్నతి కల్పించాలని ఏపీ హంస అసోసియేషన్ సిటీ అసోసియేట్ ప్రెసిడెంటు మద్దూరు వెంకటస్వామి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్లు (మేల్) అందరూ 50 సంవత్సరాలు పైబడిన వారు ఉన్నారని, కొంతమంది 5 నుంచి 10 సంవత్సరాలలోపు పదవీ విరమణ పొందుతారన్నారు. ఆరు, ఏడు సంవత్సరాలలోపు రిటైర్డు అయ్యే దాదాపు 1500 మంది ఉన్నారని, కనీసం పదోన్నతిని రెండేళ్లు కాకుండా ఏడాదికి ప్రొబెషన్ పీరియడ్‌ను తగ్గించి పదోన్నతి ఇవ్వాలని కోరారు.

రేపు హజ్ శిక్షణా శిబిరం

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జమీయత్ ఉలమా కర్నూలు, యూనిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల హజ్-2025 యాత్రికుల కోసం హజ్ శిక్షణా శిబిరాన్ని ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అబ్బాస్ నగర్‌లోని యూనిక్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు హజ్ ట్రైనర్ రాష్ట్ర కన్వీనర్ జమియత్ ఉలమా శుక్రవారం తెలిపారు. వివరాల కోసం 9032875378ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కర్నూలు క్రైం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవేంద్రనగర్‌కు చెందిన సుప్రియ(19) అనే యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సుప్రియ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నాలుగు నెలల క్రితం ఓ యువకుడిని ప్రేమించింది. ఇంట్లో తల్లిదండ్రులు ఈ ప్రేమను అంగీకరించారు. అయితే.. తండ్రి తరచుగా బాధపడు తున్నట్లుగా గుర్తించిన సుప్రియ ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు గుర్తించి ఆసుపత్రిలో చే ర్పించగా.. చికిత్స పొందుతూ శుక్రవా రం మృతి చెందింది. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కర్నూలు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జోహరాపురం సమీ పంలోని కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని మృత దేహం లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీ సులను సంప్రదించాలని సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

జీటీఎస్ ప్లాంట్‌ను త్వరగా పూర్తి చేయండి

కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జోహరాపురం డంప్ యార్డులో నిర్మిస్తున్న చెత్త రవాణా వ్యవస్థ(జీటీఎస్) ప్లాంట్‌ను వచ్చే జూన్ ఆఖరికల్లా పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జోహరాపురం డంప్ యార్డులో జీటీఎస్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజూ నివాస గృహాలు, వాణిజ్య దుకాణాల నుంచి వాహనాల ద్వారా టన్నుల కొద్ది వ్యర్థాలను సేకరించి, సుమారు 8 కి.మీ దూరంలో ఉన్న గార్గేయపురం డంప్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. దీని వల్ల వాహనాలకు ఇంధనం, సిబ్బంది సమయం వృధా అవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జొహరాపురం డంప్ యార్డులో జీటీఎస్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నా మన్నారు. ఇక్కడ నుంచి ప్రత్యేక భారీ చెత్త కంప్రెస్ వాహనాలు గార్గేయపురం డంప్ యార్డుకు చెత్తను తీసుకెళ్తాయన్నారు.



డంప్ యార్డులో జీటీఎస్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆయన వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గంగాధర్, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మల్లికార్జున, ఆంజనే యులు గౌడు, అనిల్ ఉన్నారు.

తైక్వాండో మార్షల్స్‌కు సహకారం: మంత్రి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తైక్వాండో మార్షల్స్‌కు తన వంతు సహకారం అందిస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులకు మంత్రి తన స్వగృహంలో స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా సాధన చేస్తే విజయం సాధించవచ్చునని అన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

● **మార్షల్ ఆర్ట్స్‌తో క్రమ శిక్షణ :** టీజీ వెంకటేష్: మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడునని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. టీజీవీ స్వగృహంలో తైక్వాండో క్రీడాకారులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ వెంకటేష్, తేజ, అజయ్, అకిల్, సాయి, కృష్ణ, మల్లేష్, మల్లికార్జున, లలిత, హరికృష్ణ, హీరాలాల్ పాల్గొన్నారు.



తైక్వాండో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా

పేరుకే యువత పోరు

– 'కుడా' చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువత పోరులో పంచకట్టు తప్ప యువత ఏవరు లేరని 'కుడా' చైర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తనదైన శైలిలో విమరించారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమానికి యువకులు రాకపోవడంతో వృద్ధులను తీసుకువచ్చి మమ అనిపించారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారం చేపట్టిన జగన్ గత ఐదేళ్ల పాటు యువతను నిండా ముంచేశారన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసి ఇసుక, మద్యం, మైనింగ్, గంజాయి మాఫియాలకు నిలయంగా మార్చాడన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వకుం డా జగన్ తీరని ద్రోహం చేశారన్నారు. జగన్ బకాయి పెట్టిన రీయింబర్స్‌మెంట్‌ను తమ ప్రభుత్వం చెల్లించి విద్యార్థులను ఆదుకుంటోందన్నారు. ఇకనైనా చౌకబారు కార్యక్రమాలను మానుకోవాలన్నారు. దమ్ముధైర్యం ఉంటే గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాడాలని హితవుపలికారు.

గ్లకోమాను ప్రాథమిక దశలో గుర్తించాలి



గ్లకోమా వారోత్సవాల ముగింపు వేడుకల్లో సుశీల నేత్రాలయ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గ్లకోమా వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చునని సుశీల నేత్రాలయ డైరెక్టర్, సీనియర్ కంటి వైద్య నిపుణుడు పి.సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం గ్లకోమా వారోత్సవాల ముగింపు కార్యక్రమం సుశీల నేత్రాలయలో జరిగింది. ఈ సందర్భంగా రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ కన్ను ఎర్రబడటం, చూపు మసకబారడం, బల్బ్ చుట్టు ఇంద్ర ధనస్సు వలే కాంతి వలయాలు కనిపించడం గ్లకోమా లక్షణాలు అన్నారు. చాలా మంది గ్లకోమా గురించి అవగాహన లేక పరీక్షలు చేయించుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో గైనకాలజీస్టు డాక్టర్ సావిత్రీ సుధాకర్, రేటినా స్పెషలిస్టు డాక్టర్ నేహ సుధాకర్, గ్లకోమా స్పెషలిస్టు డాక్టర్ ఆళ్లె విజయలక్ష్మి, కార్నియా స్పెషలిస్టు డాక్టర్ రాఘవ ప్రీతమ్, డాక్టర్ నేహఘోష్ పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణానికి మోక్షం



హుశేనాపురంలో కొనసాగుతున్న షాదీఖానా నిర్మాణ పనులు

ఓర్వకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీఖానా నిర్మాణ పనులకు మోక్షం లభించింది. మండలంలోని హుశేనాపురం గ్రామంలో షాదీఖానా పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని హుశేనాపురంలో 2018లో నాటి సీఎం చంద్ర బాబు నాయుడు షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేశారు. అయితే నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే షాదీఖానా నిర్మాణం షాపు లెవల్‌కు చేరింది. అప్పటికీ ప్రభుత్వం మారిపోవడంతో వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ డబ్బులు ఇవ్వకమొండి గోడల మధ్యనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముస్లిం మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ షాదీఖానా నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మినరల్ వాటర్ ప్లాంటు దగ్ధం



దగ్ధమైన మినరల్ వాటర్ ప్లాంటు

ఓర్వకల్లు మార్చి 14 (ఆంధ్ర జ్యోతి): మండలలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మినరల్ వాటర్ ప్లాంటు దగ్ధమైంది. గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో టపాకా యలు పేల్చడంతో ఆ నిప్పురవ్వలు కృష్ణారెడ్డికి చెందిన మినరల్ వాటర్ ప్లాంటుపై పడటంతో విద్యుత్ తీగలు, పరికరాలు కాలిపో యాయి. దీంతో రూ.లక్షకు పైగా నష్టం సంభవించింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఫిష్ ఆంధ్ర పథకంపై విజిలెన్స్ విచారణ!

● మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్ నవీన్ కుమార్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్య కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు అమలు చేసిన ఫిష్ ఆంధ్ర పథకం అమలులోని అవినీతి మీద పూర్తి స్థాయి విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం యూనియన్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7,600 ఫిష్ ఆంధ్ర యూనిట్లను చేపల వేట కొనసాగించే నిరుద్యోగ యువకుల కోసం అమలు చేసినట్లు తెలిపారు. కేంద్రం అందించిన రూ.56 కోట్ల తో ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పథకాన్ని మొదలు పెట్టిందని, అయితే.. ప్రస్తుతం ఆ యూనిట్ల జాడ ఎక్కడా కనిపించడం లేదన్నారు. యూనిట్ల పరికరాలను అధికారులు, నాయకులు తాము చెప్పిన కంపెనీల నుంచి కొనుగోలు చేయాలని ఒత్తిడి చేశారని, ఈ వ్యవహారంలో భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం అ య్యాయని ఆరోపించారు. త్వరలో ఈ విషయం మీద విచారణ చేయాలని ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు నవీన్ కుమార్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి జయంతి



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి చౌరస్తా సమీపం లోని వై.జంక్షన్ వాసవి నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా లక్ష్మి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాల్గుణ శుద్ధ పౌర్ణమి శుక్రవారం సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు క్షీరాభిషేకాలు, తదితర పూజలు చేశారు. అలాగే హయగ్రీవ, శ్రీమహాలక్ష్మి హోమాలు చేశారు. రాత్రి మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

మురుగు సమస్యకు పరిష్కారం



డ్రైనేజీలో మురుగును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఓర్వకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది. గత పదేళ్లుగా డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు తీవ్ర ఇబ్బదులు పడ్డారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాలతో రూ.10లక్షల మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి కెనరా బ్యాంకు వరకు డ్రైనేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓపీ కౌంటరు వద్ద చలువ పందిళ్లు

విరాళంగా అందించిన జోష్ సంస్థ



ఓపీ కౌంటర్ల వద్ద వేసిన చలువ పందిళ్ల వద్ద జోష్ ప్రతినిధులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులు ఓపీ కౌంటర్ల వద్ద ఎండ తీవ్ర తకు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కర్నూలుకు చెందిన జోష్ సంస్థ చలువ పందిళ్లను కర్నూలు జీజీహెచ్‌కు విరాళంగా అందించింది. జోష్ సంస్థ ప్రతి నిధులు సంపత్ కుమార్, సతీష్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు చలువ పందిళ్ల క్లాత్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ సంపత్ కుమార్, సతీష్ రోగులను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లను విరాళంగా అందించడం అభినందనీయమన్నారు. ఓపీ కౌంటర్ల వద్ద ఇటీవల కోకోకోలా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం: ఎంఈవో

ఓర్వకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి 31 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశామని ఎంఈవో ఓంకార్ యాదవ్ శుక్రవారం అన్నారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, ఏపీఆర్ పరీక్ష కేంద్రంలో 232 మంది, ఓర్వకల్లులోని బాలభారతి పాఠశాల కేంద్రంలో 180 మంది, ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 220 మంది, లొద్దిపల్లె జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారనీ ఆయన తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్, డిపార్టుమెంట్ ఆఫీసర్లుగా వెంకటేశ్వర్లు, సింగోటం మల్లికార్జున శెట్టి, రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, హుశేన్, సునీత వ్యవహరించనున్నారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిరాక్స్ సెంటర్లు పరీక్షలయ్యేంత వరకు ఎక్కడ కూడా తెరవరాదని, అలా తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. ఐదు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

సారా నిర్మూలనపై అవగాహనే లక్ష్యం

కర్నూలు అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాటు సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చా సుధీర్ బాబు అన్నారు. శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రచార రథం సంచరిస్తూ నాటు సారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలిజేస్తుందన్నారు. కర్నూలు నగరం బుధవారపేటలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఈఎస్ రాజశేఖరగౌడ్, రామక్రిష్ణారెడ్డి, సీఐలు రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరానికి సరిపడా తాగునీటి వసతి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్ఆర్‌పేట, కొత్తపేట ప్రాంతాలలో ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ప్రజా చైతన్య యాత్రను చేపట్టింది. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కనీసం తాగడానికి తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో కార్పొరేషన్ ఉందన్నారు. నగరానికి మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించాలని డిమాండ్ చే శారు. కార్యక్రమంలో పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్, అబ్దుల్లా, రామక్రిష్ణ, మద్దిలేటి, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వోను నియమించాలి



మాట్లాడుతున్న మౌలి బాషా

కర్నూలు కలెక్టరేట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వో నియమించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా అన్నారు. శుక్రవారం ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూవిస్తీర్ణం ప్రకారం గతంలో ఉన్న ఒక రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలందరికీ సినీయారిటీ ప్రకారం సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, గ్రేడ్-2 వీఆర్వోలకు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.శ్రీధర్, ఉపాధ్యక్షుడు టి.బుద్ధకవి, జిల్లా డివిజన్ అధ్యక్షుడు ఆర్.నర్సరాజు పాల్గొన్నారు.

వైభవంగా చెన్న సోమేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

సి.బెళగల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చెన్న సోమేశ్వరస్వామి జాతర సందర్భంగా రథోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగిం చారు. ఈకార్యకమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. జాతరకు వచ్చిన భక్తులకు తాగునీరు లేక ఇబ్బంది పడ్డారు. అయితే మద్యం మాత్రం ఏరులై పారుతున్న ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవడంలేదు. కార్యక్రములో కోడుమూరు సీఐ తబ్రేజ్, కర్నూలు తాలుకా ఎస్ఐ పీరయ్య, కర్నూలు త్రీటౌన్ ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, ఏఎస్ఐలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

సి.బెళగల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామం లో చెన్నసోమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలు ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ జాతర సందర్భంగా పోలకల్లులో గిరబండి పోటీలు, పొట్టేళ్ల పందెం, పారువేట, మహిళలకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు న్యూసిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సంద ర్భంగా నగరంలోని 24వ వార్డులో మసీద్-ఏ-మామూర్ మసీదులో శుక్రవారం ముస్లిలు ఇఫ్తార్ ఇచ్చారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం హఫీజ్‌ఖాన్‌ను ముస్లిం నాయకులు, వైసీపీ కార్యకర్తలు శాలువాతో సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి



డిపో మేనేజర్ రఫీక్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ సెంట్రల్ కమిటీ సభ్యులు

ఆదోని టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ పట్టణ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు తోవి నాగార్జున, ఉపాధ్యక్షుడు మరియాని చెన్న బసప్ప శుక్రవారం బస్సు డిపో మేనేజర్ రఫీక్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బస్టాండ్‌లోని సౌచాలయాలు, తాగునీటి ప్రాంతం అపరిశుభ్రంగా ఉన్నాయని, ప్రజలు ఉపయోగించుకొనే పరిస్థితి లేరన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికుల కోసం ప్లాంట్ ఫారంల వద్ద డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేసి, అందులో బస్సుల రాకపోకల సమయం రాయించాలని అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సూర్య, సుబ్రహ్మణ్యం, జిల్లా ఎస్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు మహేష్ నాయక్, పరమేష్, హనుమంతు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

దేవనకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలోని బీసీ కాలనీ, బస్టాండ్ సమీపంలో, ఎర్రగొటి కాలనీ శివాలయం వద్ద దాదాపు రూ.70 లక్షల సీసీ రోడ్డు పనులను మండల టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వీరేష్ ప్రారంభించారు. ఎంపీ బస్తీపాటి నాగరాజు రూ.40 లక్షలు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడంతో గ్రామంలో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ భర్త మాల బండ్లయ్య, వీఆర్ ఏఈ ఉదయ్ కుమార్, రాజాసాబ్, మురళి, రహిమాన్, రామాంజినేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి



ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆలూరు మోడల్ స్కూల్ చైర్మన్ విశ్వేశ్వరయ్య స్వామి జగదీశ్ స్వామి. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఈరన్న అన్నారు. శుక్రవారం హత్తిబెళగల్ గ్రామంలో ఉపాధి నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కత్తి రామంజినేయులు, దేవేంద్ర, ధనంజయ, శేక్షవలి, శేఖర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే మహర్దశ వస్తుందని, టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, సీనియర్ నాయకులు వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జొన్నగిరిలో వారు మాట్లాడుతూ పత్తికొండ వెనుకబడిన ప్రాంతమని, అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు తెలపడంతో ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయడంతో పాటు టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని కూడా మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తుగ్గలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు శ్రద్ధతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు కోరారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో జాగ్రత్తగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అంతేగాకుండా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మండలంలో 4 పరీక్ష కేంద్రాల్లో దాదాపు 749 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈవో తెలిపారు.

వైసీపీ నాయకులు రాజకీయ నిరుద్యోగులు

- ఐదేళ్లు ఏమి చేశారు..?
- బూతుల మంత్రులుగా మారిన వైసీపీ నాయకులు
- ధ్వజమెత్తిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

మద్దికెర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు పదవులు పోవడంతో రాజకీయ నిరుద్యోగులుగా మారి.. విద్యార్థులు లేకున్నా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారని, మీ పరిపాలనలో ఐదేళ్లు ఏం చేశారని, కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేశారంటూ జిల్లా టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని ఎం. అగ్రహారం రూ.50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును, అలాగే ఎం.అగ్రహారం గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పెరవలి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అలాగే పెరవలి గ్రామానికి చెందిన పోతుల అంజనేయ, పోతుల రంగమ్మ దంపతుల జ్ఞాపకార్థకంగా గ్రామానికి చెందిన వారి కుమారుడైన మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి, రత్నకుమారి ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ హంద్రీ నీవా కాలువను వెడల్పు చేయడం జరుగుతుందని, అందువల్ల ఈ ప్రాంతాల్లో నీరు పుష్కలంగా ఉంటుందన్నారు. ఆర్డీఎస్‌కు రూ.19 కోట్లు విడుదల చేస్తే.. వైసీపీ ప్రభుత్వం ఏమయ్యాయో తెలియదన్నారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి కాకుండా అడ్డుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం రెండు పారిశ్రామిక రంగాలను మంజూరు చేసిందని, ఒకటి కర్నూలు జిల్లాలో రూ.17వేల కోట్లతో నిర్మాణం చేపడుతున్నారన్నారు. కర్నూలు, బళ్లారి, హైవే రోడ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పత్తికొండ ప్రాంతంలో నిర్మిస్తున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ కూడా డిసెంబరు నాటికి పూర్తవుతుందన్నారు.

● వంద విగ్రహాలు ఏర్పాటు చేస్తాం:

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వంద విగ్రహాలను జిల్లాలో ఏర్పాటు చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. అలాగే తుగ్గలి నాగేంద్ర ఈ ఏడాది డిసెంబరు లోపు తుగ్గలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహఖ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, ధనుంజయ, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, సర్పంచులు మల్లికార్జున, బురుజుల విజయుడు, కారుమంచి మల్లికార్జున, మండల టీడీపీ అధ్యక్షురాలు గూడూరు కవి తదితరులు ఉన్నారు.

హనుమత్ వాహనంపై రంగనాథులు



హనుమత్ వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

మద్దికెర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలవిరాట్ రంగనాథస్వామి శ్రీదేవి భూదేవి సతీసమేత హనుమద్వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం మూలవిరాట్ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు రంగనాథస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులైన భూదేవి, శ్రీదేవి సతీసమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను శేష వాహనంపై ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి లంకోత్సవంలో భాగంగా మెయిన్ బజారు వద్ద లంకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ ఈవో వీరయ్య పాల్గొన్నారు.

జాతరకు రండి

మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి జాతరకు రావాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు ఆలయ ఈవో వీరయ్య శుక్రవారం ప్రత్యేక ఆహ్వానం పలికారు. శుక్రవారం ఆలయ ఈవో మల్లికార్జున ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని ఇచ్చారు. ఆలయ ఈవో మాట్లాడుతూ పది రోజుల పాటు దేవాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, మీరు తప్పకుండా జాతరకు హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్యే హాజరవుతానని హామీ ఇచ్చారన్నారు. దేవాలయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఆదోని రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పెద్దతుంబళంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రామాంజనేయులు కోరారు. ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం పెద్దతుంబళం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం పెంచి ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

రేపు రాష్ట్ర డాడ్జ్ బాల్ జట్టు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ డాడ్జ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16న డాడ్జ్ బాల్ పురుషుల జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కంటిరెడ్డి, కార్యదర్శి షాబీర్ మహమ్మద్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ విజయలక్ష్మి నర్సింగ్ హోమ్ వద్ద ఉన్న పాఠశాల ఆవరణంలో ఉదయం 10 గంటలకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. క్రీడాకారుల ఎంపికలో వయసుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చు అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 25 నుంచి కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో జరిగే జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఈకేవైసీ చేసుకోండి..

వెల్దుర్తి, మార్చి, 14(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యులు విఆర్వో, డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖరవర్మ తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేసుకొని వారికి వచ్చే నెల రైస్, ఇతర వస్తువులు అలాట్‌మెంట్ కావన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారన్నారు. తప్పనిసరిగా పెండింగ్‌లో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

వెల్దుర్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా శనివారం చెర్లకొత్తురు, గోవర్ధనగిరి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వినియోగదారులకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

చెరువులో చనిపోతున్న చేపపిల్లలు



మృతి చెందిన చేపలు

తుగ్గలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి చెరువులో వదిలిన చేపపిల్లలు చనిపోతుండటంతో పెంపకందారులు ఆందోళనలు చెందుతున్నారు. గత రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన మీసాల శేఖర్, గుంతా వెంకటేశ్వర్లు రూ.7.50 లక్షలకు వేలం పాడి రూ.2 లక్షలు విలువ చేసే చేపలు వదిలారు. గత రెండు రోజుల నుంచి చెరువులో వదిలిన చేపలు గట్టుకు కొట్టుకుని వస్తుండటంతో చెరువులో చేపలు ఎందుకు చనిపోతున్నాయో అర్థంగాక సర్పంచ్ ఓబులేసు, మిద్దె రవికుమార్, లక్ష్మణస్వామిలు, గ్రామ పెద్దలు బాలన్న మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చేపలు చనిపోతుండటంతో నష్టపోతామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాలికకు అండగా టీడీపీ



బాలికకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన మూడేళ్ల చిన్నారి కుప్పగల్లు గ్రామానికి చెందిన సుష్మితకు టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, బుద్దారెడ్డి, మాల రామచంద్రయ్య తెలిపారు. నాలుగు రోజుల క్రితం పాండవగల్లు సమీపంలో ఆసుపత్రికెళ్తున్న చిన్నారి తల్లిదండ్రులు ఈరన్న, ఆదిలక్ష్మీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని అన్నారు. శుక్రవారం వారు గ్రామానికెళ్లి బాలికను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాలిక స్థితిగతులను సీఎం దృష్టికి, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా మన్మథ స్వామి రథోత్సవం



మన్మథ స్వామి ఊరేగింపు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలో కిలిచిన్ పేట అంబా భవాని దేవాలయంలో మన్మథ స్వామి రథోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. హోలీ పండుగను పురస్కరించుకొని 9వ తేదీన మన్మధ శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించారు. మన్మధ స్వాములను రథోత్సవంపై ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజాముున కాముని దహనం అనంతరం రంగులు జల్లుకొని హోలీ సంబరాలు చేసుకున్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు



పూజలందుకుంటున్న స్వామి

మద్దికెర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామివారికి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

● మద్దమ్మకు పూజలు

స్థానిక గ్రామదేవత మద్దమ్మ దేవాలయంలో మద్దమ్మవ్వకు పూజలు చేశారు. శుక్రవారం పౌర్ణమి కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్ మద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేసి, రాత్రి భజనలు చేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగులో ఉత్తమ పఠనం, ఉత్తమ లేఖనంలో ప్రతిభ కనబరిచిన నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద కథల పుస్తకాలను బహుమానంగా అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక విలువలతో కూడిన పుస్తకాలను అధ్యయనం చేస్తూ, సాహిత్య అభివృద్ధిని పెంచుకోవాలని సూచించారు. బావి రచయితలుగా తెలుగు భాషకు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ కార్మికులపై కేంద్రం చిన్నచూపు



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మికుల పట్ల డబల్ ఇంజన్ సర్కార్ చిన్నచూపు చూస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రహదారిలో ఏఐటీయూసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ను ప్రైవేటీకరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. విశాఖ ఉక్కు సొంత గనులు కేటాయించకుండా కొంత ప్యాకేజీ మాత్రమే ఇచ్చిన నష్టాల సాకుతో వలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కల్లుబావి రాజు, షేక్షావలి, హుసేని, దేవా, నరసింహులు, ఈరన్న, శ్రీరాములు, హనుమంతు, నాగరాజు, సిద్ధరామయ్య పాల్గొన్నారు.

19న చలో విజయవాడ

ఆలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వియవాడలో 19న చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జేఏసీ రాష్ట్ర నాయకులు మోమమ్మద్ రఫీ శుక్రవారం పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ రద్దును ఉపసంహరించుకోవాలని, మినిమం టైం స్కేల్ అమలు చేసి, కారుణ్య నిమాయకాలు చేపట్టాలన్నారు. ప్రతి 6 నెలలకు ఒక్కసారి కరువు భత్యం ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులుగా చేసి రిటైర్డ్ వయస్సు 62 సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేత గిరి మల్లేష్ గౌడ్ శుక్రవారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుంటే వీరభద్ర గౌడ్ వాటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

పదో తరగతి పరీక్షల పర్యవేక్షణ విధులు మినహాయించాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఇన్విజిలేషన్ విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని మినహాయించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప కోరారు. శుక్రవారం ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాసులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు గర్భిణి ఉపాధ్యాయినులు, పాలిచ్చే తల్లులు, వికలాంగులు పదవి విరమణ దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులకు మానవత్వ దృక్పథంతో ఇన్విజిలేషన్ విధులకు వేయరాదని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్ బాబు, సూర్యుడు, అబ్దుల్ నబి, చిరంజీవి, నాగభూషణం, నాగరాజు పాల్గొన్నారు.

మరకట్టులో భజన పోటీలు



మరకట్టులో భజన బృందాన్ని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

ఆలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరకట్టు గ్రామంలో సలువప్ప తాత, ఉచ్చవీరప్ప తాతల రథోత్సవం సందర్భంగా గురువారం రాత్రి సలువప్ప తాత దేవాలయంలో భజన పోటీలు నిర్వహించారు. భజన పోటీల్లో 15 టీంలు పోటీ పడ్డారు. పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు మరకట్టు భజన మండలి వారు భజన పోటీల్లో బహుమతులు అందజేశారు. వీ లక్ష్మం పల్లి శివరామాంజినేయ భజన మొదటి బహుమతి 20,000ను గెలుపొందారు. రెండో బహుమతి రూ.18000ని భైరవ స్వామి భజన మండలి నార్సల నిలిచారు. రామలింశ్వర శ్రీకృష్ణ భజన మండలి మూడో బహుమతి, కందకాయ పల్లి రూ.15000లను గెలుపొందారు. కార్యక్రమంలో సర్పంచ్ బురిజంటి ఎల్లప్ప, ప్రధానోపాధ్యాలు శివ నాగన్న, గ్రామ పెద్దలు పాలక్షి రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, ఉసేని, హంచీరప్ప పాల్గొన్నారు.

ఘనంగా హోలీ



ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో...



ఆదోనిలో రంగులు చల్లుకొని నృత్యం చేస్తున్న యువత

ఆదోని వైఎస్ఆర్ కాలనీలో రంగోలి సంబరాలలో చిన్నారులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలో హోలీ సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువకులు, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకొని సందడి చేశారు. ఉదయం నుంచి యువకులు, కేరింతలు కొడుతూ కొన్ని ప్రాంతాల్లో రోడ్ల వెంబడి ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర వర్కవర్గ సభ్యుడు విట్టా రమేష్ మున్సిపల్ మెయిన్ రోడ్‌లో యువతతో కలిసి రంగులు చల్లుకొని డప్పులకు నృత్యం చేశారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వలంటీర్లను కొనసాగించాలని మార్చి 17న చలో విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావే శంలో ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు సురేష్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల జీతం రూ.5000 నుంచి రూ. 10వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించి వలంటీర్ల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో వార్డు వలంటీర్ యూనియన్ కార్యదర్శి నవీన్, నాయకులు రవి, లోకనాథ్, రమేష్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి మహిమలపై సీరియల్



సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్న నటులు

మంత్రాలయం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మహిమలను తెలిపే కన్నడ సీరియల్ చిత్రీకరణ శుక్రవారం ప్రారంభించారు. నూరు జర్మకే రాయరిద్దారే.. అనే సీరియల్‌ను నటీనటులు ధనుష్, శిల్ప, దర్శకుడు హరీష్, కెమరామెన్ సాగర్ బృందం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మధ్వమార్గ్ కారిడార్, సంస్కృత వేదమార్గ్ కారిడార్, ప్రధాన ముఖద్వారం ముందు పక్షవాతంతో పడిపోయిన వ్యక్తిని రాఘవరాయడి సన్నిధికి తీసుకొచ్చే సన్నివేశం చిత్రీకరించారు. సీరియల్ చిత్రీకరణను చూసేందుకు భక్తులు, గ్రామస్థులు ఎగబడ్డారు.

ఉజ్వల భవిష్యత్‌కు చదువు ఒక్కటే మార్గం



పరీక్షా ప్యాడ్‌లతో విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కోసిగి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు చదవు ఒక్కటే మార్గమని ఇంటిగ్రేడ్ హాస్టల్ వార్డెన్ కోటేశ్వరయ్య అన్నారు. శుక్రవారం ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి, నాయకులు కిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతి రాత బాగుంటే మంచి మార్కులు

గోనెగండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చేతి రాత బాగుంటే పరీక్షలలో మంచి మార్కులు వస్తాయని హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ షహేనా పర్వీన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణను ట్రైనర్ రాజశేఖర్ ద్వారా ఇప్పించారు. ఈ సందర్భంగా రైటింగ్‌లో తీసుకోవాల్సిన మెలుకువలను ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం ట్రైనర్ రాజశేఖర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 60మంది విద్యార్థులు ఫార్మాస్యూటికల్ సైన్స్‌సెస్ డివిస్ ల్యాబొరేటరీస్ సంస్థ డ్రైవ్‌లో ట్రైనీ సూపర్‌వైజర్లుగా ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ అధికారి ఉమ్మర్, ప్రొఫెసర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ క్యాంపస్ డ్రైవ్‌లో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో 60 మంది విద్యార్థులు ట్రైనీ సూపర్‌వైజర్లుగా ఎంపిక అయ్యారన్నారు. ఉన్నతంగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వాగేష్, ప్రొఫెసర్ సౌజన్య అన్నారు.

తాగునీరు కలుషితం

● మరమ్మతులకు నోచుకోని పైపులైను
● రోగాల బారిన ప్రజలు



వాటర్ పైపు మరమ్మతు కోసం మూడు నెలల క్రితం తవ్వి వదిలేసిన గుంత

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపేటలో మాచాని సోమప్ప స్కూల్ దగ్గర తాగునీటి పైపు లైను లీకేజీ అవుతున్నా మునిసిపల్ అధికారులు మరమ్మతులు చేయడం లేదు. దాంతో తాగునీరు కలుషితమవుతోంది. మరమ్మతుల కోసం గుంత తవ్వి దాదాపు మూడు నెలలు కావస్తున్నా పట్టించు కోవడం లేదు. పైపు లైన్ నుంచి నీరు లీకేజీ అవుతూ వృథాగా పోవడమే కాక మళ్లీ అదేనీరు పైపులైన్ ద్వారా సరఫరా అవుతుండడంతో వాసన వస్తోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇలాగే కొనసాగితే కాలనీవాసులు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. పైపులైను మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంబరంగా హోలీ

ఎమ్మిగనూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువకులు జట్లు, జట్లుగా ఏర్పడి పట్టణంలో తిరుగుతూ తమ మిత్రులను కలుసుకొని రంగులను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ముఖ్యంగా పట్టణంలోని తేరుబజారు, ముగతి పేట, బంగారు బజారు, వీవర్స్ కాలనీ, సోమప్ప సర్కిల్, హెచ్‌బీఎస్ కాలనీ, శిల్పా ఎస్టేట్‌తో పాటు ఆయా కాలనీల్లో యువతీ, యువకులు హోలీ వేడుకలను ఎంతో సంబరంగా జరుపుకున్నారు. కొంతమంది ఏకంగా డ్రమ్స్‌తో పట్టణంలో తిరుగుతూ తమ వెంట తెచ్చుకున్న వివిధ రంగులను మిత్రులపైన, బంధువులపై చల్లి పరస్పరం హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు వీధుల్లో రంగు డబ్బాలను పట్టుకొని తిరుగుతూ సందడి చేశారు. ఇక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సైతం హోలీ సంబరాలు జరుపుకున్నారు.

కౌతాళం: మండలంలో శుక్రవారం హోలీ వేడుకలను పిల్లలు, యువకులు, పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి వీధుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగులను స్నేహితులు, బంధువులు ఒకరికొకరు పూసుకుని సంబరాలు చేసుకు న్నారు. రంగుల నీళ్లు చల్లుకున్నారు.



కౌతాళంలో..



మంత్రాలయంలో..

మంత్రాలయం: మంత్రాలయంలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మంత్రాలయం పుణ్యక్షేత్రం ప్రధాన రహదారులు, రాఘవేంద్రసర్కిల్, బస్టాండ్ ప్రాంతంలో భక్తులు, యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈలలు, కేరింతలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానాల ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి పూజలుచేసి మొక్కులు తీర్చుకున్నారు.



ఎమ్మిగనూరులో హోలీ సంబరాల్లో యువకులు



గాంధీనగర్‌లో రంగులు చల్లుకుంటున్న వ్యాపారులు

మంత్రాలయంలో భక్తుల కోలాహలం

మంత్రాలయం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శుక్రవారం హోలీ సెలవు దినం, పౌర్ణమి శుభదినం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు రావడంతో అతిథి గృహలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. అంతక ముందు స్వామి వారికి పాదపూజ చేశారు.



మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పదిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

మండల విద్యాధికారి రామ్మూర్తి



పెద్దకడబూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యమని మండల విద్యాధికారి రామ్మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు?

జవాబు: మండలంలో 9 పాఠశాలల నుంచి 690 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. వంద శాతం ఉతీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

జవాబు: మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేశాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

జవాబు: మండలంలో మండలంలో 42 పాఠశాలలు ఉన్నాయి. 9 హైస్కూల్‌లు, ఐదు యూపీ, 28 ప్రాథమిక పాఠశాలు ఉన్నాయి.

ప్రశ్న: నాడు-నేడు పథకంలో ఎన్ని పాఠశాలలు వచ్చాయి?

జవాబు: మండలంలో నాడు- నేడు పథకం మొదటి విడతలో 18 పాఠశాలలు పూర్తయ్యాయి. 2వ విడతలో 25 పాఠశాలల భవనాలు పూర్తి కాలేదు.

ప్రశ్న: మండలంలో ఉపాధ్యాయుల సంఖ్య ఎంత మంది? కొరత ఉందా?

జవాబు: మండలంలో మండలంలో 277 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంకా 72 మంది ఉపాధ్యాయులు కావాల్సి ఉంది.

సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలి



డి.బెళగల్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోసిగి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని సీపీఎం మండల నాయకులు రాముడు, వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీ బెళగల్ గ్రామంలో సీపీఎం ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా దొడ్డి బెళగల్ రెండు గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో గురవుతున్నట్లు గుర్తించామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమంతు, నాగేంద్ర, వీరేష్, తాయన్న పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



పూజలు చేస్తున్న అర్చకులు

మంత్రాలయం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పౌర్ణమి శుభదినం సందర్భంగా ప్రవచన మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గంధం, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. సామూహికంగా సత్యనారాయణ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పండితులు తీర్థప్రసాదాలను అందజేశారు.

లాడ్జీల వివరాల సేకరణ

మంత్రాలయం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రైవేట్ లాడ్జీలు, హోంస్టేలపై ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో వివరాల సేకరణ ముమ్మరంగా చేపట్టారు. గత ఆరు నెల లుగా హోంస్టేల పేరుతో ఇళ్లను సైతం లాడ్జీలుగా మార్చేసి భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలుచేయడం, ఆ కాలనీల్లో జీవనం సాగి స్తున్న కుటుంబాలు వ్యతిరేకించడంపై మంత్రాలయంలో చర్చనీయాంశం గా మారింది. హోంస్టేల పేరుతో కొత్త దందాకు మంత్రాలయంలో తెర లేపటంతో ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో కొత్త బిజినెజ్ .. హోంస్టే అన్న శీర్షిక ద్వారా కథనం ప్రచురించింది. దాంతో పోలీసు అధికారులు స్పందించి వారంరోజుల నుంచి లాడ్జీల్లో ఎన్నిగదులు ఉన్నాయి, రికార్డులు, సీసీ కెమరాలు, లాడ్జీ యజమానులు, లీజ్ యజమానులు, పార్కింగ్ స్థలం, ఫైరింగ్ నియంత్రణ, పేకాట ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలపై వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రైవేట్ లాడ్జీల వివరాల సేకరణ అనంతరం యజమానులు, లీజ్ యజమానులతో సమావేశం నిర్వహించి లాడ్జీలకు ఉండవలసిన అనుమతులపై చర్చించి లేనివాటిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఐరన్‌బండ రోడ్డు అధ్వానం



గుంతలు పడ్డ గోనెగండ్ల ఐరన్‌బండ రహదారి

గోనెగండ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం ఐరన్‌బండ, ఎన్నెకండలకు వెళ్లే దారి రాళ్లు తెలి అధ్వానంగా మారింది. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారి మొత్తం గుంతపడి పోవడంతో ద్విచక్ర వాహనాలను, ఆటోల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తిమ్మాపురంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగి పశుగ్రాసం దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ పేట నాగరాజు, ఖాజావలికి చెందిన తెల్లజొన్నసప్పను పశువుల కోసం నిల్వ చేసుకున్నారు. అయితే ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.60వేల నష్టం వాటిల్లింది. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రేపటి నుంచి అన్నదానం

కౌతాళం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక దేవి దర్శనం కోసం పాద యాత్రగా బయలుదేరుతున్న భక్తులకు మండలంలోని ఓబుళాపురం గ్రామస్థులు ఈ నెల 16 నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అన్నదాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగా కర్ణాటక భక్తులకు హల్వి గ్రామ వెలుపల ఉన్న దద్దల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదానం చేస్తామని తెలిపారు.

ముళ్లపొదల మధ్య తాగునీటి బోరు



ముళ్లపొదల మధ్య ఉన్న బోరు

పెద్దకడుబూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో తాగునీటి బోరును చుట్టు ముళ్లపొదలు మొలచడంతో వినియోగించుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు. అసలే వేసవి కావడంతో గ్రామంలో తాగునీటి సమస్య మొదలైంది. తాగునీటి బోరు చుట్టు ఉన్న ముళ్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

కౌతాళం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరిగేరి తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. దాంతో గ్రామస్థులు ప్రతిరోజూ తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి సరఫరా చేసే నీటిని కూడా సమయానికి విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు వెళ్లిన తరువాత తాగునీరు సరఫరా చేయడంతో ఎవరూ పట్టుకోవడం లేదని, పనులు వదులుకుంటే తప్ప నాలుగు బిందెల నీళ్లు దొరకడం లేదని వాపోతున్నారు. చివరి కాలనీవాసులకు బిందె తాగునీరు కూడా దొరకదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్ర తినిధులు, అధికారులు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అగ్రహారంలో..

గోనెగండ్ల: మండలంలోని అగ్రహారం గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్థులు గ్రామ శివార్లలోని పొలాల్లో ఉన్న బావులు, బోర్ల నుంచి దొబ్బుడు బండ్లపై నీటిని తీసుకెళ్తున్నారు. గ్రామంలో బోరు పనిచేయక పోవడం, పైప్ లైన్ సక్రమంగా లేక పోవడంతో ఈ సమస్య ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం పై గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు రోజులుగా గ్రామంలో బోరు సక్రమంగా పనిచేయ లేదని, అందుకు గాను సమస్య ఏర్పడిందని బుధవారం బోరును మరమ్మతు చేశామని ఇక పైప్‌లైన్ పనులు చేపట్టామని రెండు మూడు రోజులలో పనులు పూర్తి అవుతాయన్నారు.



తాగునీటి కోసం వేచి ఉన్న ప్రజలు